క్లుప్తంగా

రేపు ఉండవెల్లిలో ఈదమ్మ ఉత్సవాలు

ఉండవెల్లి: మండల కేంద్రంలో మంగళవారం ఈదమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం కోలాటం, భజన పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

మురుగు కాల్వలు శుభ్రం చేయండి



మానవపాడు: మండల కేంద్రంలోని వివిధ కాలనీలో ఉన్న మురుగు కాల్వలను శుభ్రం చేయాలని మండల కేంద్రంలోని ప్రజలు కోరుతున్నారు. ఎస్సీ కాలనీలో, గ్రంథాలయం పక్కనే మురుగు కాల్వ చెత్తతో నిండుకుంది. మురుగు వల్ల ఈగలు, దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి

ఎర్రవల్లిచౌరస్తా: కాంగ్రెస్ ప్రభుత్వం ముందుగా బీ సీ గణన చేపట్టి జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబా బు అన్నారు. ఆదివారం ఇటిక్యాల మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్ర భుత్వం పంచాయతీరాజ్ చట్టంలో అనేక సవరణ లు చేసిందన్నారు. దీనిలో భాగంగా బీసీల రిజర్వేషన్లను 34శాతం నుంచి 23శాతం వరకు తగ్గించి బీసీలకు పూర్తిగా అన్యాయం చేసిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించి బీసీలను పూర్తిగా అణిచివేసిందన్నారు. రిజర్వేషన్లు తగ్గించడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు పూర్తిగా న ష్టపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని గమనించి బీసీ గణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో బీఎస్పీ ఆధ్వర్యంలో బీసీ సామాజిక వర్గా ల ప్రజలకు మద్దతుగా పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

రైతు వేదికకు పగుళ్లు



ఉండవెల్లి: లక్షలు వెచ్చించి నిర్మించిన రైతువేదిక లక్ష్యం లేకుండా, పట్టింపు లేకుండా పగుళ్లు కనబడుతున్న పట్టించుకోవడం లేదు. మండలంలోని మారమునగాల-2 గ్రామంలోని రైతు వేదికను రూ.22 లక్షలతో నిర్మించిన సర్పంచుల పదవీ కాలం పూర్తయింది. అప్పటి ప్రభుత్వం కూడా పడిపోయింది. కొత్త ప్రభుత్వం మారడంతో రైతువేదికలను అధికారులు పట్టించుకోవడం లేదు. అప్పులు చేసి ఖర్చులు వెచ్చించి సర్పంచులు రైతు వేదికలను నిర్మిస్తే వాటిని మూతవేయడంతో గోడలు పగుళ్లు వచ్చాయి. రైతు వేదిక గోడలు పగుళ్లు రావడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం లక్షలు ఖర్చు పెట్టిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. రైతు వేదికలలో ఏఈఓలు లేక మూసివేయడంతో రైతులు మళ్లీ పాత పద్ధతికే పోయిందని సతమతమవుతున్నారు. మండల కేంద్రానికి వచ్చి పనులు చేయించుకోవాలంటున్నారు. దీంతో రైతు వేదికలు వృథాగా మారాయి. మండల కేంద్రంలో మాత్రం మండల వ్యవసాయ కార్యాలయాన్ని మూసివేయడంతో ఎక్కడికి వెళ్లాలో రైతులకు తెలియక ఆలోచనలో పడ్డారు. పంటలు వేసుకునే సమయంలో సలహాలు ఇచ్చే అధికారులు కనుమరుగవుతున్నారు. అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తారని కోరుతున్నారు.

రోడ్లపై వర్షపు నీటితో అవస్థలు

గద్వాల రూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వ ర్షాలకు పట్టణంలోని రోడ్లన్నీ జలమయంగా మారా యి. ప్రధానంగా కృష్ణవేణి చౌరస్తా నుంచి భీంనగర్ వైపు వెళ్లే రహదారి, రాజీవ్‌మార్గ్‌లో పాత ఎస్పీ రెసిడెన్స్, అంబేడ్కర్‌చౌరస్తా నుంచి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి వెళ్లే దారిలో రోడ్లపైనే వర్షపు నీరు నిలిచింది. దీంతో రహదారి పక్కన నడవడానికి పాదాచారులు, ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆగి ఉన్న నీటిపై బస్సు, లారీలు వెళ్లినప్పుడు మరింత ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు వాహనాలను అదుపుచేయలేక ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి రోడ్లపై నీటిని తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.



పెద్దవాగులో మట్టిదిబ్బలు

- ప్రవాహానికి అడ్డుగా.. పొంచి ఉన్న ప్రమాదం
- వరదొస్తే పట్టణం మునిగిపోయే అవకాశం
- పట్టించుకోని అధికారులు, పాలకులు



పెద్దవాగులో గుట్టలుగా మట్టి దిబ్బలు

అయిజ: పట్టణంలోని కొత్త బస్టాండ్ – పాత బస్టాండ్ మధ్యవాగులో నూతనంగా నిర్మించిన బ్రిడ్జి పక్కన కాంట్రాక్టర్ పెద్దవాగులో మట్టి దిబ్బలు గుట్టలు గుట్టలుగా వేయడంతో వాగులో నుంచి నీరు ప్రవహించడానికి ప్రతికూలంగా ఉంది. పెద్ద వర్షాలు కురిసి వాగుకు వరద వస్తే బ్రిడ్జి కింది నుంచి నీరు వెళ్లిపోయే పరిస్థితిలేదు. బ్రిడ్జికి అడ్డంగా గోడకట్టినట్లు ఎత్తైన మట్టిదిబ్బలు వాగులో ఉండడంతో పట్టణానికి ముప్పు పొంచి ఉంది. గతంలో వాగులో ముళ్ల పొదలు దట్టంగా వ్యాపించడంతో 2009లో వచ్చిన వరదలకు అయిజ పట్టణం సగం మునిగిపోయింది. దానివల్ల రూ.కోట్ల ఆస్తినష్టం వాటిల్లింది. ప్రజలు అనేక విధాలుగా నష్టపోయారు. ఇప్పటికప్పుడు అకాల వర్షాలు కురిసి వాగుకు వరద వస్తే పట్టణం మునిగిపోయే పరిస్థితి పునరావృతం అవుతుంది. అధికారులు, పాలకులు ఇవేమీ పట్టించుకోకవడంతో ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రమాదం పొంచి ఉంది..

గతంలో వాగులో ముళ్ల పొదలు దట్టంగా అలుముకున్నాయి. భారీ వర్షాలు కురువడంతో 15 ఏళ్ల క్రితం వాగులో వరద ప్రవాహం అయిజ పట్టణాన్ని ముంచేసింది. అయిజ పట్టణంలోకి నీరుచేరి కమంతంపేట, గుర్రం తోట, ఉప్పర పేట, అంబేడ్కర్ కాలనీ, ఎస్సీ కాలనీ, తెలుగుపేట, మాలపేట తదితర కాలనీలు వరద నీటిలో మునిగి పోయాయి. ఆ రోజు పట్టణంలోని వివిధ కాలనీల ప్రజలు ఊరిని ఖాళీ చేసి మండలంలోని వివిధ గ్రామాల్లో తలదాచుకున్నారు. అప్పటి నుంచి అధికారులు రెండు మూడు సంవత్సరాల కోసారి పట్టణంలోని పెద్ద వాగులో పెరిగిన ముళ్ల పొదలను తొలగిస్తూ వచ్చారు. ముళ్లపొదలు పెరుగకుండా పట్టణంలోని పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ మధ్యన వాగులో బ్రిడ్జికి ఇరువైపుల 200 మీటర్లమేర రూ. కోటి నిధులతో సీసీ కాంక్రీట్ బెడ్ వేశారు. అదేవిధంగా 8 సంవత్సరాల క్రితం రూ.8 లక్షలు వెచ్చించి వాగులో యంత్రాలతో ముళ్ల పొదలను తొలగించారు. ఇప్పుడు ముళ్ల పొదల స్థానంలో మట్టిదిబ్బలు వేయడంతో వాగుకు వరద వస్తే ముందుకు సాగని పరిస్థితులు ఏర్పడ్డాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వాగులోని మట్టి దిబ్బలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

15 ఏళ్ల క్రితం పరిస్థితి పునరావృతం అవుతుంది



వాగులో ముళ్ల పొదలు దట్టంగా వ్యాపించడం వల్ల 15ఏళ్ల క్రితం వరద నీరు పట్టణాన్ని ముంచెత్తింది. ఇప్పుడు ముళ్ల పొదలు తొలగించగా, మట్టి దిబ్బలు పెద్దవాగుకు అడ్డంగా మారాయి. ఇప్పుడు జాగ్రత్త పడకుంటే అప్పటి పరిస్థితులు మళ్లీ వచ్చే అవకాశం ఉంటుంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బాషా, అయిజ

ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



ఆర్అండ్‌బీ అధికారులు పట్టణంలో పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మించారు. దానికోసం తవ్విన మట్టిని వాగులో డంప్ చేశారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యింది. అప్రోచ్ రోడ్డుకు ఆ మట్టిని ఉపయోగిస్తారేమోనని అనుకున్నాం. ఇంతవరకు కాంట్రాక్టర్ వాగులోని మట్టి దిబ్బలను తొలగించలేదు. భారీ వర్షాలు కురిసి వాగుకు వరద వస్తే పట్టణం మునిగిపోయే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని ఆర్అండ్ బీ అధికారులకు తెలియజేస్తాం.

– గోపాల్, మున్సిపల్ ఏఈ

అధికారులు చర్యలు తీసుకోవాలి



మున్సిపాలిటీలోని పెద్ద వాగులో మట్టి దిబ్బలను గుట్టలు గుట్టలుగా వేయడంతో వరదనీరు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని మట్టిదిబ్బలను తొలగించాలి.

– తిరుమలరెడ్డి, అయిజ

మట్టిదిబ్బలు ప్రవాహానికి అడ్డుగా ఉన్నాయి



ప్రతి సంవత్సరం వాగులో ముళ్ల పొదలను అధికారులు తొలగిస్తూ వచ్చారు. ఈయేడాది వాగులో మట్టి దిబ్బలు పెద్ద మొత్తంలో ఉండడంతో నీటి ప్రవాహానికి అడ్డుగోడలా మారాయి. భారీ వర్షాలు కురిస్తే వాగులో వచ్చే వరద ప్రవాహానికి పట్టణంలోని వివిధ కాలనీలను ముంచెత్తుతుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాల్సిన అవసరం ఉంది.

– నాగరాజు, అయిజ

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



ధరూర్‌లో సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



రాజోళిలో సుందరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



గట్టులో సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు


ఉండవెల్లి: మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు, సీపీఎం ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం జిల్లా నాయకులు మద్దిలేటి ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలే ప్రాణంగా, ఉద్యమమే ఊపిరిగా, ఆశయాలే గీటురాయిగా కడదాకా నడిచిన కమ్యూనిస్టు వైతాళికుడు పుచ్చలపల్లి సుందరయ్య అని కొనయాడారు. కమ్యూనిస్టు నాయకులే కాదు, ప్రతిపక్ష నాయకులు సైతం అభిమానించే అంతటి ఆదరణ పొందినటువంటి నాయకుడు సుందరయ్య అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్ర, రాముడు, కృష్ణ, సంజన్న, రాంబాబు పాల్గొన్నారు.

గట్టు: భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సీపీఎం ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో సుందరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వీవీ నర్సింహ మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నర్మద, మండల కార్యదర్శి ఆంజనేయులు, స్వామి, నర్సింహులు, బలరాముడు, గోవిందు, లక్ష్మన్న, తిమ్మప్ప పాల్గొన్నారు.

రాజోళి: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాజోళి బస్టాండ్ ఆవరణలో, సీఐటీయూ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దస్తగిరి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి విజయ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో లక్ష్మన్న, ఆటోయూనియన్ నాయకులు జయన్న, బాషా పాల్గొన్నారు.

ధరూరు: కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని మండల కేంద్రంలోని ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూల మాల వసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటితరం రాజకీయ నాయకులు సుందరయ్య జీవితాన్ని చూసి నేర్చుకోవాల్సింది చాలా ఉందని, రాజకీయ రంగంలో ఆదర్శవంతమైన నేతగా సుందరయ్య నిలిచారన్నారు. కార్యక్రమంలో నర్సింహులు, తదితరులు ఉన్నారు.

ఘనంగా చౌడేశ్వరి, బీరప్ప ఉత్సవాలు



ఖిల్లాఘనపురం మండలం మానాజీపేటలో బోనాలతో వస్తున్న మహిళలు

ఖిల్లాఘనపురం: మండలంలోని మానాజీపేటలో ఆదివారం సొడమ్మ, బీరప్ప దేవతల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కుర్వ యాదవులు ఉదయం నుంచి గ్రామంలోని దేవతల దేవాలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కుంకుమ, పసుపు, పూలు, గంధం తదితర వాటితో అందంగా ఏర్పాటు చేసిన బోనాల్లో దేవతల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన వంటకాలను తీసుకుని గ్రామంలోని పురవీధుల్లో మహిళలు ఊరేగింపుగా వచ్చారు. దేవతలకు నైవేద్యాలను అర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వేర్వేరుగా హాజరై సొడమ్మ, బీరప్ప దేవతలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడారు. మన సంస్కృతికి అనుగుణంగా పండుగలు జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా వారిని గ్రామస్తులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వనపర్తి కాంగ్రెస్ జిల్లా నాయకులు వెంకటేష్, రాజమల్లయ్యలతో పాటుగా కాంగ్రెస్ నాయకులు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, కురుమూర్తి యాదవ్, రాళ్లకృష్ణయ్య, జెడ్పీటీసీ సభ్యులు సామ్యనాయక్, ఎంపీటీసీ నాగన్న యాదవ్, వెంకటేష్, నారాయణరెడ్డి, శివన్న, సుక్కన్న, కృష్ణయ్య పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకునేదెవరు?



నేత కార్మికుడు రాఘవేంద్ర

శాంతినగర్: నిరుపేద చేనేత కార్మికులను ఆదుకునేదెవర ని నేతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యంత్రాలతో బట్ట లు తయారు చేస్తు న్న తరుణంలో వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న నేతన్నల బతుకులు రోజురోజుకు ఛిద్రంగా మారుతున్నా యని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటు తయారు చేసిన వస్త్రాలకు గిట్టుబాటు ధరలు లేక, అటు ప్రభుత్వం ద్వారా సబ్సిడీలు, సంక్షేమ పథకాలకు నోచుకోక, ఆదరణ లేక కొట్టుమిట్లాడుతున్నట్లు పేర్కొన్నారు. మగ్గం ఆడనిదే మనుగడలేని నేతన్నల ఆవేదన ఆలకించి చేనేత కార్మికుల కోసం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలకు నిధులు మంజూరుచేసి, కొత్త పథకాలు ప్రవేశపెట్టి ప్రభు త్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

అయిజ: జిల్లాలోని వివిధ మండలాల్లో సోమవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీ ఈ గోవిందు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిజ మండల కేంద్రంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి అయిజ 33 కేవీ, గొర్లఖాన్‌దొడ్డి 33 కేవీ ఫీడర్‌లో, గద్వాల 132/33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి బిజ్వారం వెళ్లే 33 కేవీ ఫీడర్‌లో సోమవారం మరమ్మతు చేపట్టనున్నట్లు తెలిపారు. అయిజ పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు, గట్టు మండలంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌కు, మిట్టదొడ్డి, గొర్లఖాన్ దొడ్డి సబ్‌స్టేషన్‌లకు అదేవిధంగా మల్దకల్ మండలంలోని బిజ్వారం, బూడిదపాడు, గద్వాల మండలంలోని కాకులారం సబ్‌స్టేషన్లకు ఉదయం మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా అయిజ పట్టణంతో పాటు మండలంలోని బింగిదొడ్డి, జడదొడ్డి, ఎక్లాస్‌పురం గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు తెలిపారు. గట్టు మండల పరిధిలోని గొర్లఖాన్‌దొడ్డి, అరగిద్ద, తప్పెట్ల మొర్సు, మి ట్టదొడ్డి, తుమ్మలపల్లి, ముచ్చోనిపల్లి, చాగదోణ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలివేస్తున్న ట్లు తెలిపారు. మల్దకల్ మండలంలోని బిజ్వారం, దాసరపల్లి, బూడిదపాడు, అమరవాయి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

గద్వాల అర్బన్: విద్యుత్ లైన్ల మరమ్మతు, చెట్ల కొమ్మలు తొలగింపు, కొత్తలైన్ల ఏర్పాటుతో విద్యుత్ సరాఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ రమేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గద్వాల సబ్‌స్టేషన్ 132/33కేవీ నుంచి వెళ్లే ధరూరు మండలంలోని మార్లబీడు, కేటీదొడ్డి మండలంలోని వెంకటాపురం, ఇర్కిచేడు, గద్వాలలోని డ్యాం రోడ్డులో ఉన్న 33/11కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు సోమవారం ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరాఫరా ఆపేస్తున్నట్లు తెలిపారు.

కలిసికట్టుగా పోరాడుదాం



సమావేశానికి హాజరైన అఖిలపక్ష నాయకులు

అయిజ: సమస్యలు పరిష్కారమయ్యే వరకు కలిసికట్టుగా పోరాడుదామని అఖిలపక్ష కమిటీ సభ్యులు తీర్మానం చేశారు. ఆదివారం పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనంలో అఖిలపక్ష కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడారు. పట్టణంలోని పెద్దవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు పూర్తయినా సరే అప్రోచ్ రోడ్డు పనులు పూర్తికాలేదని, వెంటనే పూర్తి చేయాలని, నెల రోజులుగా పోరాటం చేస్తున్నా పనులు నత్తనడకన సాగుతున్నాయని మండిపడ్డారు. అధికారులు, కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెస్తే తప్పా పనులు ముందుకు సాగడం లేదని విమర్శించారు. పులికల్ రోడ్డు నిర్మాణం పూర్తికాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ కళాశాల, రెవెన్యూ డివిజన్ కోసం అలుపెరగని పోరాటం చేయాలని తీర్మానించారు. జూన్ 4వ తేదీ తర్వాత అఖిలపక్ష కమిటీ ద్వారా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేయాలని నిర్ణయించారు. ఈనెల 26న రెడ్డి రాయల్ ఫంక్షన్ హాల్లో మండల స్థాయి, పట్టణ స్థాయి అఖిలపక్ష కమిటీలను ఎన్నుకోవాలని తీర్మానించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసులు

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని పైపాడులో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కబడ్డీ పోటీలను వడ్డేపల్లి మాజీ జెడ్పీ టీసీ శ్రీనివాసులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎల్లప్ప, తిమ్మప్ప, తిమ్మారెడ్డి, కొండలు, లాలు, బీచుపల్లి, వేణు, మాదన్న, యువకులు పాల్గొన్నారు.

డ్రెయినేజీలు నిర్మించాలి



అమరవాయిలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో డ్రెయినేజీలు లేక మురుగుతో పాటు వర్షపు నీరు రోడ్లపై పారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అమరవాయి, ఎల్కూరు, బిజ్వారం, నీలిపల్లి, తాటికుంట, మల్దకల్ గ్రామాలలోని వివిధ కాలనీల్లో ఇళ్ల నుంచి వచ్చే నీటితోపాటు వర్షపు నీరు నిలిచిపోవడంతో గ్రామస్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఆయా గ్రామాల ప్రజలు పలు మార్లు డ్రెయినేజీలు నిర్మించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రోడ్ల నిర్మాణ సమయంలో డ్రెయినేజీలు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్లపై మురుగు నీరు నిలుస్తున్నట్లు కాలనీవాసులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా గ్రామాలలో రోడ్లపై నీరు నిల్వకుండా డ్రెయినేజీలు నిర్మించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ధరూర్ పాఠశాలలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ధరూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002– 2003 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. అప్పట్లో విద్యాబోధన చేసిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి మాజీ డిప్యూటీ డీఈఓ ఆంజనేయులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఈఓ సురేష్, రవి, రామాంజనేయులు, ప్రకాష్‌గౌడు, 70 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



మానవపాడులో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

మానవపాడు: ప్రమాకరంగా కంచెలేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయకుండా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు నిత్యం వస్తుంటారు. రోడ్డు పక్కన కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. మండల కేంద్రంలోని ప్రధాన కూడలి గాంధీచౌక్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. కంచె లేకపోవడంతో చాలాసార్లు ప్రమాదాలు సంభవించాయి. కలుకుంట్ల, అమరవాయి, పెద్దఆముదాలపాడు, నారాయణపురం, మద్దూరు, బుర్దిపాడు గ్రామాల ప్రజలు ఈ రోడ్డు గుండానే ప్రయానిస్తుంటారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



బోరును ప్రారంభిస్తున్న నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ అన్నారు. ఆదివారం ఎర్రవల్లి మండలంలోని దువాసిపల్లిలో రూ.1,50,000 వ్యయంతో ఏర్పాటు చేసిన మంచి నీటి బోర్లను గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించిందన్నారు. వాటితో గ్రామంలో నీటి వనరులను వినియోగించుకునేందుకు గాను ఉపయోగంలో లేని బోర్లు, చేతి పంపులకు మరమ్మతులు చేయిస్తుందన్నారు. పల్లెల్లో ఎక్కడైనా ప్రజలకు తాగు నీటి సమస్యలుంటే వెంటనే స్థానిక అధికారుల దృష్టికి తీసుకురావాలని, వెంటనే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉస్సేన్, సుంకిరెడ్డి, ఆంజనేయులు, గ్రామస్తులు ఉన్నారు.

నియామక పత్రం అందజేత



నియామకపత్రం అందుకుంటున్న శశివర్మ తేజ

అయిజ: మండలంలోని పులికల్ గ్రామానికి చెందిన శశివర్మ తేజ ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం అలంపూర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలో ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం గద్వాల జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ శశివర్మ తేజకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రకాష్, మోజేష్, అశోక్, యువరాజ్ పాల్గొన్నారు.